వాటర్ ప్లాంట్‌పై రాజకీయ కక్ష..!



మంత్రి స్వామి ఒత్తిడితో వాటర్ ప్లాంట్‌కు నోటీస్ అంటిస్తున్న వీఆర్వో



విప్పగుంటలో ప్లాంట్ మూసివేస్తున్న అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

- విప్పగుంటలో మంచినీటి వాటర్ ప్లాంట్ మూసివేయించిన తహసీల్దార్
- మంత్రి స్వామి చెప్పాడంటూ ప్లాంట్ మూసివేయాలని నోటీసులు
- ప్లాంట్ ఏర్పాటుకు అనుమతి లేదంటూ రాజకీయ కక్ష సాధింపులు
- ప్లాంట్ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని మూడు నెలల క్రితం దరఖాస్తు
- మంచినీటికి అవస్థలు పడుతున్న గ్రామస్తులు

పొన్నలూరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత గ్రామాల్లో కూటమి నేతల ఆగడాలు అధికమయ్యాయి. ప్రతి విషయంలో అనవసరంగా జోక్యం చేసుకుంటూ రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడుతున్నారు. గ్రామాల్లో ప్రభుత్వ అధికారులను అడ్డుపెట్టుకొని వారి అండదండలతో చెలరేగిపోతున్నారు. ఆఖరికి ప్రజలకు అవసరమైన మంచినీటి ప్లాంట్‌ను కూడా మూసివేయించి సంబరపడిపోతున్నారు. వివరాల్లోకి వెళితే..పొన్నలూరు మండలం విప్పగుంటలో 2008లో గ్రామంలో మంచినీటి ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఈ వాటర్ ప్లాంట్‌ను కూడా ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే ఆ పార్టీ సానుభూతి పరులు పర్యవేక్షిస్తూ వస్తున్నారు. అయితే గ్రామంలో సుమారుగా 800 కుటుంబాలకు పైగా ఉండి 3000 పైగా జనాభా ఉండటంతో ఉన్నా వాటర్ ప్లాంట్ నుంచి వచ్చే మంచినీరు సరిపోవడం లేదు. దీంతో గ్రామానికి చెందిన కొంకా శ్రీనివాసులు సర్వే నంబర్ 336లో తన పూర్వీకులు నుంచి సంక్రమించిన సుమారు 2 సెంట్ల స్థలంలో ఈ ఏడాది జనవరిలో ఒంగోలు వాటర్ బోర్డు వారి నుంచి అనుమతి తీసుకొని వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. దీని ద్వారాగా గ్రామంలోని పేద కుటుంబాలకు ఉచితంగా మంచినీటిని అందిస్తూ, గ్రామస్తులకు రూ.3 చొప్పున 20 లీటర్లు మంచినీటిని అందిస్తున్నాడు. అయితే ఇది మింగుడు పడని స్థానిక టీడీపీ సానుభూతిపరులు ఎలాగైనా వాటర్ ప్లాంట్‌ను మూసివేయించాలని రాజకీయ కక్ష సాధింపులతో మంత్రి బాలవీరాంజనేయ స్వామి ద్వారాగా స్థానిక తహసీల్దార్, ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శిని పురమాయించారు. మంత్రి స్వామి చెప్పిందే తడువుగా గత ఏప్రిల్ నెలలో అధికారులు విప్పగుంట గ్రామానికి వెళ్లి వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు అనుమతి లేదంటూ, ఇలానే ప్లాంట్ కొనసాగిస్తే కేసులు బనాయించాల్సి ఉంటుందని బెదిరించి మూసివేయించారు. అలాగే ప్లాంట్‌కు ఏర్పాటు చేసుకున్న విద్యుత్ సరఫరాను కూడా నిలిపివేయించారు.

అనుమతి ఇవ్వని తహసీల్దార్...

పొన్నలూరు మండలంలో 24 గ్రామ పంచాయతీలు, మరో 20 అనుబంధ గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో సుమారుగా 50కు పైగా ప్రైవేట్ వాటర్ ప్లాంట్లు ఉన్నాయి. వీటిలో ఒక్కదానికీ అనుమతులు లేవు. కానీ వాటి జోలికి వెళ్లని అధికారులు, కావాలనే మంత్రి స్వామి ఆదేశించాడంటూ విప్పగుంటలోని వాటర్ ప్లాంట్‌కు అనుమతి లేదంటూ మూసివేయించి రాజకీయ కక్ష సాధింపులకు అండగా నిలిస్తున్నారు. అయితే విప్పగుంటలో నిర్మించిన వాటర్ ప్లాంట్‌కు అనుమతి ఇవ్వాలని గత ఏప్రిల్‌లో దరఖాస్తు చేశారు. కానీ మంత్రి స్వామి ఆదేశాలతో తహసీల్దార్ మూడు నెలలు గడుస్తున్నా అనుమతి ఇవ్వకపోవడంతో గ్రామస్తులు కోర్టును ఆశ్రయించారు. దీంతో ఈ నెల 23న ప్లాంట్ నిలిపివేతపై వివరణ ఇవ్వాలని కోర్టు తహసీల్దార్, వీఆర్వోకు నోటీసులు పంపించింది. అయితే మరోసారి స్థానిక తెలుగు తమ్ముళ్ల ఒత్తిడితో మంత్రి స్వామి ఆదేశాల మేరకు తహసీల్దార్ సోమవారం వీఆర్వో ద్వారా వాటర్ ప్లాంట్ తెరవవద్దని నోటీస్ అంటించారు. వాటర్ ప్లాంట్ సర్వే నంబర్ 336లో ఉన్నందున ఈ భూమి గ్రామకంఠం కావడంతో పాటు, వాల్టా చట్ట కింద అనుమతి లేదంటూ నోటీస్ అంటించారు. వాస్తవంగా విప్పగుంటలోని నివాసాల్లో రెండు వంతుల భాగం గ్రామ కంఠం భూమిలోనే ఉన్నాయి. ప్రస్తుతం గ్రామంలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ స్థలం కూడా గ్రామకంఠం అయినప్పటికీ పూర్వీకులు నుంచి సంక్రమించి పంచాయతీ పన్ను కూడా ఉండటం గమనార్హం. ఇది ఇలా ఉంటే సోమవారంఇచ్చిన నోటీసుల్లో 3వ తేదీ వేసి ఉండటం గమనార్హం.

మంచినీటికి ఇబ్బందులు...

అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించి విప్పగుంటలో వాటర్ ప్లాంట్ మూసివేయడంతో గ్రామంలోని కొన్ని కుటుంబాల వారు మంచినీటికి ఇబ్బందులు పడుతున్నారు.

న్యాయంగా వ్యవహరించాల్సిన అధికారులు కూటమి నేతల మాటలు విని ఇలాంటి పనులకు పాల్పడి సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం ఏంటంటూ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ఒంగోలు వాటర్ బోర్డు వారు మంజూరు చేసిన అనుమతి పత్రం



వాటర్ ప్లాంట్ నిర్మాణానికి చెల్లించిన పంచాయతీ పన్ను రశీదు

క్లుప్తంగా

వైఎస్సార్ జయంతిని వాడవాడలా నిర్వహించండి

కనిగిరిరూరల్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ జయంతి వేడుకలను అన్ని గ్రామాల్లో నిర్వహించాలని వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ వివిధ విభాగాల అనుబంధ సంఘాల నాయకులు, మున్సిపల్ చైర్మన్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు అందరూ హాజరు కావాలని కోరారు. వైఎస్సార్ జయంతి సందర్భంగా మంగళవారం ఉదయం 8 గంటలకు మాచవరంలోని విగ్రహానికి, ఉదయం 8.30 గంటలకు చెక్‌పోస్టు వద్ద ఉన్న విగ్రహానికి, 9 గంటలకు గార్లపేట రోడ్డులో, ఉదయం 9.30 గంటలకు చింతలపాలెంలోని వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తామన్నారు.

రత్తమ్మకు ఘన నివాళి



రత్తమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

పామూరు: మండలంలోని మోపాడు పంచాయతీ వాకమల్లవారిపల్లెకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకురాలు వాకమల్ల రత్తమ్మ(51) అనారోగ్యంతో మృతి చెందింది. సోమవారం మృతురాలి భౌతికకాయానికి వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి, జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య పలువురు నాయకులు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కల్లూరి వెంకటేశ్వర్లు, వాకమల్ల నరసింహారెడ్డి, మునగల నారాయణరెడ్డి, జి.రామిరెడ్డి, కందుల పోలిరెడ్డి, యం.అర్జున్, కందుల మహేష్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ జయంతి వేడుకలు

పీసీపల్లి: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 76వ జయంతి వేడుకలను మంగళవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గోపవరపు బొర్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు అందరూ పాల్గొనాలని కోరారు.

నేడు వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం

కనిగిరిరూరల్: వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం మంగళవారం ఉదయం 11 గంటలకు పవిత్ర ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు పార్టీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ, రీకాలింగ్ చంద్రబాబూ మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, పార్టీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డిలు పాల్గొంటారని తెలిపారు. పార్టీ నాయకులందరూ హాజరు కావాలని పిలుపునిచ్చారు.

మీ కోసంకు 4 అర్జీలు



డీటీకి సమస్యను వివరిస్తున్న రైతు

సింగరాయకొండ: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో జరిగిన మీకోసం కార్యక్రమానికి నాలుగు అర్జీలు వచ్చినట్లు డిప్యూటీ తహశీల్దార్ టి.ప్రసాద్ తెలిపారు. పాసుపుస్తకాలు కావాలని రెండు, మరణ ధ్రువీకరణ పత్రం కోసం ఒకటి, రికార్డుల్లో పేరు మార్చాలని ఒక అర్జీ వచ్చింది. ఎంపీడీఓ డి.జయమణి, ఏఓ పూర్ణచంద్రరావు, ఇరిగేషన్ రవి రవిబాబు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సరిత పాల్గొన్నారు.

253 పొగాకు బేళ్లు తిరస్కరణ



వేలం నిర్వహిస్తున్న అధికారులు

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో నిర్వహించిన వేలంలో 253 బేళ్లను తిరస్కరించారు. క్లస్టర్ పరిధిలోని ముప్పరాజుపాలెం, పెరిదేపి, మిట్టపాలెం, అనకర్లపూడి గ్రామాలకు చెందిన రైతులు 981 బేళ్లను వేలానికి తీసుకురాగా 728 బేళ్లను కొనుగోలు చేశారు. గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.160, సరాసరి ధర రూ.227.68గా నమోదైంది. వేలంలో 20 కంపెనీలు పాల్గొన్నాయి.

సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసిన చిట్యాల



సజ్జల రామకృష్ణారెడ్డిని సన్మానిస్తున్న చిట్యాల

హనుమంతునిపాడు: మండలంలోని పెద్ద గొల్లపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ ఐటీ విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్యాల విజయ్ భాస్కర్‌రెడ్డి సోమవారం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డిని హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఐటీ విభాగ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియామకం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కనిగిరిరూరల్: విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం టౌన్ ఫీడర్ పరిధిలోని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ పవన్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని కందుకూరు రోడ్డు, నక్కల తిప్ప, తీగల గొంది, ఎమ్మెస్సార్ రోడ్డు, వరమ్మకొట్టు, కాశీనాయన గుడి తదితర ప్రాంతాల్లో కరెంట్ సరఫరా నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

సమ్మెను జయప్రదం చేయండి

టంగుటూరు: సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం సాయంత్రం స్థానిక పురం సెంటర్ నుంచి ప్రచారం చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టంగుటూరు రాము, వి.మోజెస్, టి.ప్రభాకర్, కాలేషాబేగ్, టి.వెంకట్రావు, ఎస్కే మీరావలి, బ్రహ్మానందం పాల్గొన్నారు.

ఎవరు..ఎప్పుడు..ఎక్కడ ఉంటారో..?



టంగుటూరు- 1వ సచివాలయంలో 12:05 గంటలకు ఖాళీగా ఉన్న కుర్చీలు



హాజీపురం సచివాలయంలో ఒకేఒక్కరు

- సమయపాలన పాటించని సచివాలయ సిబ్బంది
- ప్రజలకు తప్పని ఇబ్బందులు

టంగుటూరు: సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటించడం లేదు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సిబ్బంది ఇష్టం వచ్చినట్లు విధులకు హాజరవుతున్నారు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. టంగుటూరు-1 సచివాలయం సోమవారం మధ్యాహ్నం 12:05 గంటలు దాటినా ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి. ఒకే ఒక్క మహిళా అధికారి ఉన్నారు. ఉదయం 10 గంటలకు హాజరు కావాల్సిన సచివాలయ సిబ్బంది మధ్యాహ్నం వరకు హాజరు కాకపోవడంతో వివిధ పనులపై వచ్చిన ప్రజలు ఎవ్వరూ లేకపోవడంతో వెనక్కి తిరిగి వెళుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ సచివాలయాలపై మండల, జిల్లా అధికారుల అజమాయిషీ కొరవడంతో ఎప్పుడు ఎక్కడ ఉంటారో అర్థం కాని పరిస్థితి.

హనుమంతునిపాడు: మండలంలోని సచివాలయాల్లో సిబ్బంది సమయపాలన పాటించడం లేదు. ఉదయం 11 గంటలకు కూడా విధులకు హాజరు కావడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఒక్కో సచివాలయంలో ఒక్కొక్కరు చొప్పున మాత్రమే విధుల్లో ఉంటున్నారు. మిగిలిన సిబ్బంది ఎక్కడికి వెళతారో ఎవ్వరికీ తెలియడం లేదు. ముప్పళ్లపాడు సచివాలయంలో విలేజ్ పోలీసు తప్ప సిబ్బంది లేరు. నందనవనం, హనుమంతాపురం, లింగంగుంట్ల, వాలిచర్ల, దాసరిపల్లి, కొండారెడ్డిపల్లి, కూటాగుండ్ల, పెద్ద గొల్లపల్లి సచివాలయాల్లో 11 గంటలకు విధులకు హాజరు కాలేదు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే ఈ పరిస్థితి నెలకొందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నారాయణస్వామి ఆదాయం రూ.1.48 లక్షలు



చైర్మన్‌కు విరాళం నగదు అందజేస్తున్న దాతలు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆలయానికి ఆదివారం రూ.1,48,681 ఆదాయం వచ్చినట్లు ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ, ఈఓ ఎస్‌జీఆర్. నరసింహబాబు తెలిపారు. స్వామి దర్శనం టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.66,230, లడ్డుప్రసాదాల అమ్మకంద్వారా రూ.29,870, ఆలయం వద్ద నిర్వహిస్తున్న శాశ్వత అన్నదానం పథకం నిర్వహణకు విరాళాలుగా రూ.52,581 వచ్చినట్లు తెలిపారు. బేస్తవారిపేటకు చెందిన ఆకుల వెంకటనారాయణ, లక్ష్మి తిరుపతమ్మలు రూ.30,116లు, సీఎస్‌పురం మండలం పెదగోగులపల్లి గ్రామానికి చెందిన మిరియం నారాయణ, బాలగురవమ్మ, నారాయణస్వామి, రాధికలు రూ.10,116 విరాళంగా ఇచ్చినట్లు ఈఓ, చైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో కొమ్మినేని వెంకట్రావు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసి నాయకులు ఖాశింపీరా

కనిగిరిరూరల్: మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఏఐటీయూసి మండల కార్యదర్శి ఎస్కే ఖాశింపీరా మాట్లాడుతూ ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్య పరిష్కారంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని తీవ్రంగా మండిపడ్డారు. ఈనెల 9న నిర్వహించే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని, 11న కలెక్టరేట్ వద్ద ధర్నా, 15న చలో విజయవాడ కార్యక్రమాలను జయప్రం చేయాలని, కార్మికులకు పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ నాయకులు అశోక్, నాసర్, కిరణ్, తాజుద్దీన్, శేషయ్య, రత్తయ్య, యేసుబాబు పాల్గొన్నారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సీడీపీఓ సరోజినీకి సమ్మె నోటీ అందజేశారు.

పోలింగ్ బూత్ ఏర్పాటుకు పరిశీలన



భవనాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ, తహసీల్దార్

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని రేగులచెలక పంచాయతీ పరిధిలో నూతన పోలింగ్ కేంద్ర ఏర్పాటుకు ఈఆర్ఓ, కనిగిరి ఆర్డీఓ జి.కేశవర్ధన్‌రెడ్డి, తహసీల్దార్ షేక్.మహ్మద్ హుస్సేన్ సోమవారం నూతన భవనాలు పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల అధికారుల సూచనల మేరకు ఒక్కో పోలింగ్ బూత్‌లో 1200 ఓటర్లు మాత్రమే ఉండాలని ప్రసుత్తం రేగులచెలక పోలింగ్ బూత్‌లో 1222 ఓట్లు ఉండగా కొత్తగా మరికొన్ని వచ్చే అవకాశం ఉన్న దృష్ట్యా నూతన పోలింగ్‌బూత్ ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. దీనికోసం అదే పంచాయతీ పరిధిలోని గణేషునిపల్లి ప్రాథమిక పాఠశాలను పరిశీలించామన్నారు. రేగులచెలక ప్రాథమిక పాఠశాలను పరిశీలించగా అవి సరిగా లేవన్నారు. దీనిపై నివేదికను ఎన్నికల అధికారులకు పంపనున్నట్లు వారు తెలిపారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



మాదక ద్రవ్యాల అనర్థాలపై వివరిస్తున్న సీఐ భీమానాయక్

సీఎస్‌పురం(పామూరు): మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండి ఆరోగ్యకర సమాజాన్ని నిర్మించుకుందామని సీఐ ఎం భీమానాయక్ అన్నారు. మండలంలోని సి.నాగులవరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం పాఠశాల హెచ్‌ఎం బుడాల డేవిడ్ అధ్యక్షతన మాదకద్రవ్యాల నియంత్రణ, వాటి వాడకం వల్ల వచ్చే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ భీమానాయక్ మాట్లాడుతూ పొగాకు, గంజాయి, డ్రగ్స్ వాడకంతో యువత ఒకసారి పెడదారి పడితే వారి జీవితాలు ఛిద్రమవుతాయన్నారు. యువత చెడు సహవాసాలకు దూరంగా ఉండి మంచి భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించారు. కష్టపడి ఉన్నత స్థితికి చేరుకోవాలని సూచించారు. నాయకులు ముప్పాళ్ల వసంతకుమార్‌రాజు, కృష్ణ, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు కిరణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్సై మాధవరావు ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, మత్తు పదార్థాల వల్ల అనర్థాలు, లైంగిక దాడులపై అవగాహన కల్పించారు. యువత మత్తు పానియాలకు బానిస కావద్దని సూచించారు. బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేత



సీఎస్‌పురం(పామూరు): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని ఆర్‌కేపల్లి ఎంపీపీఎస్ హెచ్‌ఎం జి.హరిబాబు అన్నారు. మండలంలోని రెడ్డిగారికొత్తపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో గ్రామానికి చెందిన పాఠశాల పూర్వ విద్యార్థులు చల్లా మనోజ్, చల్లా మధులు సొంత నిధులతో సమకూర్చిన నోట్‌బుక్స్, జామెట్రీబాక్స్‌లు, పెన్స్, ఇతర విద్యాసామగ్రిని హెచ్‌ఎం హరిబాబు దాతలతో కలసి విద్యార్థులకు అందజేశారు. చావా సుబ్బయ్య, ఉపాధ్యాయురాలు ఆర్‌వీ సౌజన్య, దాతలు పాల్గొన్నారు.

ముగిసిన మొహర్రం వేడుకలు



జలదిస్నానానికి ఉత్సవంగా బయలుదేరుతున్న పీర్లతో సీఐ, ఎస్సై, భక్తులు

పామూరు: మండలంలోని పలు గ్రామాల్లో వారం రోజులుగా నిర్వహిస్తున్న మొహర్రం వేడుకలు సోమవారం పీర్ల స్నానంతో ముగిశాయి. ఈ సందర్భంగా పామూరులోని మార్కెట్ పీర్ల చావిడి, కందుకూరురోడ్డులలో ఉన్న పీర్లు, గోపాలపురం, సీఎస్‌పురంలో ఉన్న పీర్లకు ముజావర్‌లు, హిందూ, ముస్లింలు పూజలు చేశారు. వేకువజామున గుండం దూకగా సాయంత్రం సమయంలో మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ పీర్లను అందంగా అలంకరించి ప్రధానవీధులలో ఊరేగింపుగా జలదిస్నానానికి పీర్లను తరలించారు. ఉత్సవంలో సీఐ ఎం భీమానాయక్, ఎస్సై టి.కిషోర్‌బాబు పాల్గొని పూజలు చేశారు. ముజావర్లు షేక్.ఖాజా మొహిద్దీన్, హిందూ, ముస్లింలు పాల్గొన్నారు.

యోగా టీచర్లను నియమించాలి

కనిగిరిరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో యోగా టీచర్లను నియమించాలని సోమవారం ఏఐవైఎఫ్ నాయకులు ఆర్డీఓ బి.కేశవర్ధన్‌రెడ్డికి వినతిపత్రం అందచేశారు. పుట్టా సుబ్బారావు, మాచపల్లి పూర్ణ చంద్రరాజు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ పవన్, ఖాశింపీరా తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర్లుని పరామర్శించిన నేతలు



నాగిరెడ్డిపాలెంలో వెంకటేశ్వర్లుని పరామర్శిస్తున్న నేతలు

పొన్నలూరు: మండలంలోని నాగిరెడ్డి పాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కంటు వెంకటేశ్వర్లు ఇటీవల విద్యుత్ షాక్‌కు ప్రమాదానికి గురై చికిత్స పొంది ఇంటి దగ్గర విశ్రాంతి పొందుతున్నారు. దీంతో జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుద్దుగుంట మల్లికార్జునరెడ్డి సోమవారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. వెంకటేశ్వర్లు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు మూలే కృష్ణారెడ్డి ఉన్నారు.

విద్యార్థులకు ఇంగ్లిష్‌లో ఉచిత శిక్షణ

కందుకూరు రూరల్: ఇంటర్మీడియట్ పాసైన విద్యార్థులకు ఇంగ్లిష్ కమ్యూనికేషన్, బేసిక్స్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్, జనరల్ అవేర్నెస్ అంశాలపై ఈ నెల 10వ తేదీ ఉదయం 10 గంటలకు టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాతిక సంవత్సరాల అనుభవం, పీహెచ్‌డీ, నెట్ క్వాలిఫైడ్ అధ్యాపకులు విద్యార్థులకు శిక్షణ ఇస్తారని చెప్పారు. కందుకూరు పరిసర ప్రాంతాల్లో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై, డిగ్రీ, ఇతర కోర్సుల్లో చేరాలనుకుంటున్న విద్యార్థులు ఈ ఉచిత శిక్షణకు హాజరు కావాలన్నారు.